సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 10 । జూలై । 2023



సచివాలయాలే దేవాలయాలు

సచివాలయాలే ఆయా గ్రామాల దేవాలయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అన్నారు.

- 8లో



కాళ్ల పారాణి ఆరక ముందే..!

మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన జర జాన రవిరావుకు, పట్టణ పరిధిలోని సారథికి చెందిన కల్యాణితో ఫిబ్రవరి 12న వివాహమైంది.

- 8లో



ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి.

- 8లో

న్యూస్‌రీల్

నేడు పెద్దగెడ్డ రిజర్వాయరు నీటి విడుదల



పాచిపెంటలో పెద్దగెడ్డ రిజర్వాయర్

సాలూరు: పాచిపెంట మండల కేంద్రంలోని పెద్దగెడ్డ రిజర్వాయరు నీటిని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర సోమవారం విడుదల చేయనున్నారు. సాలూరు, బొబ్బిలి నియోజకవర్గాల్లో సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు ఈ రిజర్వాయరు ద్వారా అందనుంది. ఈ రిజర్వాయరు ద్వారా సాగునీటితో పాటు సీపీడబ్ల్యూ పథకం ద్వారా సుమారు 96 గ్రామాలకు తాగునీరు అందుతుంది. ఇదిలా ఉండగా రిజర్వాయరు ఆధునీకరణకు సుమారు 28.7కోట్ల జైకా నిధులు మంజూరయ్యాయి. వీటితో ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. చురుగ్గా సాగుతున్నాయి.

'కిలార్క్'తో ఆరోగ్యంపై అవగాహన

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు



డీఎంహెచ్‌వో డా. బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: కిలార్క్ వాయిస్ ద్వారా గర్భిణులు, శిశు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. బి.జగన్నాథరావు తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ కిలార్క్ వాయిస్‌తో నాలుగు విభాగాల్లో సాంకేతిక ఆరోగ్య సందేశాలను అందించడం జరుగుతోందన్నారు. కిలార్క్ ఐవీఆర్ రికార్డింగ్ ద్వారా 72 సందేశాలను అందిస్తుందని అందులో గర్భిణులు, శిశువుల ఆరోగ్యం, ఆస్పత్రి ప్రసవాలపై సందేశాలు మొబైల్ ఫోన్ ద్వారా వినిపిస్తుందని చెప్పారు. కిలార్క్ వాయిస్‌తో అన్నయ్య, వదినమ్మ, నమస్కారం .. బాగున్నారా... భారత ప్రభుత్వం నుండి ఫోన్ చేస్తున్నామని వాయిస్ వస్తుందని, ఇది ఆరు వారాల పాటు 0124458800 ఫోన్ నంబరు నుండి గర్భిణులకు, బాలింతలకు కాల్ చేసి సాంకేతిక ఆరోగ్య సందేశాలను ఇస్తుందని వివరించారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోతే 14423 ఫోన్‌కు కాల్ చేయవచ్చని చెప్పారు. ఆశా కార్యకర్తలు, గర్భిణులకు కిలార్క్‌పై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. ఇందులో అందిన వివరాలు ప్రజా స్పందనగా సమర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జోషిత్, శ్రీయాన్



చెస్ ఎంపిక పోటీలు

బొబ్బిలి: రాష్ట్ర స్థాయిలో ఈ నెల 11 నుంచి జరగనున్న అండర్ 11 చెస్ పోటీలకు ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. కళింగ వైశ్య భవనంలో నిర్వహించిన పోటీల్లో కందుకూరి జోషిత్, కింతలి శ్రీయాన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు తెలిపారు. పోటీలకు ఆర్బిటర్‌గా మూడడ్ల గణేష్‌నాయుడు, నంబూరు వంశీకృష్ణ, గౌతమ్ వ్యవహరించారు.

గిరి శిఖర రహదారులపై గలీజు రాతలు

ఎత్తైన కొండల వరుసల్లో విసిరేసినట్టు ఉండే గిరిజన గూడలకు ప్రభుత్వం బతుకు దారి చూపుతోంది. విద్య, వైద్య సదుపాయాలు సులభంగా అందేలా కోట్లాది రూపాయల ఖర్చుతో రోడ్లు నిర్మిస్తోంది. గిరిజన పల్లెలను ప్రగతి పట్టాలెక్కిస్తోంది. గిరిజనుల బతుకు చిత్రం మార్చే ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో సాగుతున్న రోడ్ల నిర్మాణాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

- మన్యంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత
- ఐటీడీఏ పరిధిలో 1102 గ్రామాలకు చేరుకునేందుకు వీలుగా 511 బీటీ రోడ్లు
- కొత్తగా 14 రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు
- జిల్లాలో కొత్తగా 14 రహదారులకు 37.59 కిలోమీటర్ల మేర రూ.33.62 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ ఓర్వలేకే పచ్చ మీడియా అసత్య కథనాలు

పార్వతీపురం టౌన్: గిరిజన గూడలకు రోడ్ల సదుపాయం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో కోట్లాది రూపాయలు కేటాయించింది. ప్రభుత్వ లక్ష్యం మేరకు అటవీ, రెవెన్యూ అధికారులను సమన్వయం చేస్తూ రోడ్ల నిర్మాణాలను అధికారులు చురుగ్గా సాగిస్తున్నారు. డోలీ కష్టాలు తీర్చేలా దారులు వేస్తున్నారు. కొండల వరుసల్లో ఉండే గూడలను రోడ్లతో కలుపుతున్నారు. సంక్షేమ పథకాలను చేరవేస్తున్నారు. గిరిజనుల ప్రగతికి బాటలు వేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ఎనలేని ఆదరణ గిరిజనుల నుంచి లభిస్తోంది. ఈ విషయాన్ని గ్రహించిన ప్రతిపక్షం తన అనుకూల మీడియా సహాయంతో ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నంలో భాగంగా గిరిజనులకు దారి చూపేవారే లేరా.. అనే కథనం వండి వార్చింది. ఈ కథనానికి అధికారుల వివరణతో 'సాక్షి' ఫ్యాక్ట్ చెక్ కథనం.

రోడ్ల నిర్మాణాలు ఇలా...

నాలుగేళ్లలో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 1102 గ్రామాలకు చేరుకునేందుకు వీలుగా 511 బీటీ రోడ్లు, 167 డబ్ల్యూబీఎం రోడ్లు, 162 గ్రావెల్ రోడ్లను నిర్మించారు. రోడ్డు సదుపాయం లేని మరో 262 గ్రామాలకు రూ.256 కోట్ల వ్యయంతో 345 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి పనులు చేపట్టారు. గిరిశిఖర గ్రామాల్లో మిషనరీ పనుల కోసం రూ.16 కోట్ల వ్యయం అవసరమని ప్రతిపాదించారు. ఐటీడీఏ పరిధిలో రోడ్డు లేని గ్రామం ఉండకూడదన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ముందుగా వైద్యసేవలు అందని పల్లెలకు రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నారు.



ఆజూరు నుండి పందిరిమామిడివలస రహదారి నిర్మాణ పనులు

14 గ్రామాలకు అటవీ శాఖ అనుమతులు

గిరిశిఖర గ్రామాలకు తక్షణమే రోడ్లు వేసేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. అటవీ శాఖ అనుమతులు రావడంతో పంచాయతీ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తున్నారు. సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, భామిని మండలం మనిగ నుండి అంటిజోడు వరకు, నడిమిగూడ నుండి లగూడ వరకు, కొత్తగూడెం నుండి నడిమిగూడ వరకు, దిమ్మిడిజోల నుండి కొత్తగూడెం వరకు, గోకులగూడ నుండి శ్రీకాకుళం జిల్లా సరిహద్దు వరకు, సీతంపేట మండలం రేగులగూడ నుండి పాతపెద్దగూడ, పాతరంగంవలస నుండి రంగంవలస, పెద్దగూడ నుండి పాతరంగంవలస వరకు నిర్మిస్తున్న రహదారులకు అవసరమైన అటవీ స్థలానికి అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించింది. రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ, అటవీ శాఖ అధికారులు రహదారి నిర్మిస్తున్న ప్రాంతాలను పరిశీలించి, మారుమూల గ్రామాల గిరిజనులకు వాటి అవసరాన్ని గుర్తించి సిఫారసు చేశారు. జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీలో విస్తృతంగా చర్చించి అనుమతులు మంజూరు చేశారు. ఈ రహదారులను ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈఏ కార్యక్రమంలో నిర్మించేందుకు ప్రతిపాదించారు.

పీఆర్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు

జిల్లాలో అటవీ శాఖ అనుమతులు రావడంతో మారుమూల గిరిజన గ్రామాలకు కొత్తగా 14 రహదారులకు 37.59 కిలోమీటర్ల మేర రూ.33.62 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. సంబంధిత రోడ్ల వివరాలు..

- రూ. 3.02 కోట్లతో సీతంపేట మండలంలో పూతికవలస నుండి ద్వారబంధం వరకు ఐదు కిలోమీటర్ల మేర రహదారి.
- రూ.4.67 కోట్లతో కురుపాం మండలం అవిరి ఆర్అండ్‌బీ రోడ్డు నుండి మత్రిపాడు ఆర్అండ్‌బీ రోడ్డు వరకు మండల సరిహద్దు వరకు 6.80 కిలో మీటర్ల రహదారి.
- రూ.4.66 కోట్లతో అవిరి ఆర్అండ్‌బీ రోడ్డు జంక్షన్ నుండి దిమ్మిడిజోల వరకు (మండల సరిహద్దు వరకు) ఆరు కిలో మీటర్ల రహదారి.
- రూ.1.58 కోట్లతో అంటిజోల నుండి మనిగ వరకు (మండల సరిహద్దు వరకు) 2.30 కిలో మీటర్ల రహదారి.
- రూ.2.63 కోట్లతో గుమ్మలక్ష్మీపురం మండలం దేరువాడ నుండి వనకాబడి వరకు 2.80 కిలోమీటర్ల రహదారి.

ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు

- సాలూరు మండలం కొదమ గ్రామ పంచాయతీలో పోయిమాల నుండి సిరివెర రోడ్డు (1340 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పుతో..)
- సాలూరు మండలం కొదమ గ్రామ పంచాయతీలో తాడిపుట్టి నుండి డోయివోర రోడ్డు (650 మీటర్ల పొడవు, 7.50 మీటర్ల వెడల్పుతో..)
- సాలూరు మండలం కొదమ గ్రామ పంచాయతీలో డోయివోర నుండి పోయిమాల రోడ్డు (1415 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పుతో..)
- మక్కువ మండలం పనసభద్ర గ్రామ పంచాయతీలో బండమెండంగి నుండి తాడిపూడి రోడ్డు (757 మీటర్ల పొడవు, 7.50 మీటర్ల వెడల్పుతో..)



పాచిపెంట మండలం నీలంవలస నుండి గుమ్మడిగూడ రోడ్డు పనులు



కారాడవలస నుండి సాలూరు రహదారి నిర్మాణ పనులు

గిరిశిఖర గ్రామాలకు రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ



గిరిశిఖర గ్రామాలకు రోడ్లు వేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు వీలుగా బాటలు వేస్తున్నాం. కొన్ని గిరిశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మించడం కష్టతరమే. ప్రభుత్వం చొరవతో వీటిని పూర్తి చేస్తాం. అటవీశాఖ అనుమతులు రావడంతో రోడ్ల నిర్మాణాలు ప్రారంభిస్తాం. గిరిశిఖర గ్రామాల్లో రోడ్డు లేక వైద్యం అందలేదన్న మాట వినిపించకుండా ప్రగతి బాటలు వేసేందుకు కృషి చేస్తున్నాం.

– ఎంవీఆర్ కృష్ణాజీ, పంచాయతీరాజ్ ఎస్ఈ, పార్వతీపురం మన్యం

20న తోటపల్లి నీరు విడుదల



తోటపల్లి జలాశయం

- శివారుకే తొలి ప్రాధాన్యత
- ప్రాజెక్టులో పుష్కలంగా నీరు
- గరిష్ట నీటి మట్టం 105 మీటర్లు
- ప్రస్తుతం ఉన్న నిల్వ 104.10 మీటర్లు
- ఆయకట్టు 64 వేల ఎకరాలు

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలో ఉన్న పాత ఆయకట్టుకు ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తి స్థాయిలో నీరందించి పార్వతీపురం మన్యంతో పాటు శ్రీకాకుళం జిల్లాలను సస్యశ్యామలం చేయడానికి జల వనరుల శాఖ అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 20న తోటపల్లి ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయనున్నారు. ఇప్పటికే సకాలంలో విత్తనాలు అందజేసి సాగునీటి వనరులు, వ్యవసాయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది. తొలుత శివారుకే ప్రాధాన్యత ఇచ్చి ఈ జలాశయం పరిధిలో ఉన్న చెరువులను నింపేందుకు జల వనరుల శాఖ అధికారులు లక్ష్యంగా చేసుకున్నారు.

ఇదీ తోటపల్లి పరిస్థితి

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో 64 వేల ఎకరాల పాత ఆయకట్టు ఉంది. ఇందులో పాత కుడి కాలువ పరిధిలో 7,156 ఎకరాలు, ఎడమ కాలువ పరిధిలో 33,124 ఎకరాల ఆయకట్టు, అదనంగా ఈ రెండు కాలువల పరిధిలో మరో 23,750 ఎకరాలు ఉంది. ఈ ఆయకట్టుకు నీరిందించే తోటపల్లి ప్రాజెక్టులో గరిష్ట నీటి సామర్థ్యం 2.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.75 టీఎంసీల నీరుంది. గరిష్ట నీటి మట్టం 105 మీటర్లు కాగా ప్రస్తుతం 104.10 మీటర్లు ఉంది. మరో వైపు వర్షాలు అడపా, దడపా కురుస్తుండడంతో ఈ నీటి నిల్వలతో ప్రాజెక్టు పరిధిలో ఉన్న పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలను సస్యశ్యామలం చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 20న తోటపల్లి పాత ఆయకట్టు కాల్వలకు నీరు విడుదల చేయనున్నట్లు జల వనరుల శాఖ డీఈఈ దమలపాటి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిలకడగా పైనాపిల్ ధర

- ఒక్కో పండు రూ.15-20కి విక్రయం
- మరికొద్ది రోజుల్లో ముగియనున్న సీజన్



వ్యాపారులు కొనుగోలు చేసిన పైనాపిల్

సీతంపేట: గత నెల రోజులుగా పైనాపిల్ ధరలు నిలకడగా ఉన్నాయి. ఆదివారం స్థానిక మార్కెట్‌లో ఒక్కో పండు సైజును బట్టీ రూ.15 నుంచి 20 మధ్య గిరిజనులు విక్రయించారు. సీజన్ ఆరంభం నుంచి ఇవే ధరలు కొనసాగుతున్నాయని గిరిజనులు తెలియజేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం పెద్దగా ఈ ఏడాది దిగుబడులు లేకపోవడమేనని రైతులు అంటున్నారు. గతేడాది ఇదే నెలలో పండు ధర రూ.8 వరకు పడిపోయిందని ఈ సంవత్సరం మొదటి నుంచి ఒకే ధరలకు విక్రయిస్తున్నట్టు గిరిజనులు తెలిపారు. అయితే దిగుబడి పెద్దగా లేనపుడు ధరలు రూ.20 పైబడే ఉండాలని వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో ఈ పరిస్థితి దాపురించిందని గిరిజనులు పేర్కొంటున్నారు. కొండకోనల్లో సేకరించిన పైనాపిల్‌ను కావళ్లతో మోసుకు వచ్చి విక్రయించిన్నప్పటికీ శ్రమకు తగ్గ ఫలితం లభించలేదని గిరిజనులు చెబుతున్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి పండ్ల ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు తెలిపారు. వ్యాపారులు నిర్ణయించిన తక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నామన్నారు. పండు నిల్వ చేసినా రెండు, మూడు రోజుల్లో చెడిపోయే ప్రమాదమున్నందున తప్పనిసరి పరిస్థితుల్లో విక్రయించాల్సి వస్తుందన్నారు.

నేడు జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఎస్సీ చదివిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు



- జిల్లాలో 4216 పనులకు రూ.67 కోట్లు మంజూరు
- జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కె.రామచంద్రరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కె.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను జీఎస్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నివేదికలను పంపించామని తెలిపారు. జిల్లాలో 4216 పనులకు రూ.67కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. వాటి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. గ్రామాలు, పట్టణాలలో తాగునీటి సమస్యల పరిష్కారానికి, తాగునీటి సరఫరాకు, నీటి నిల్వ చేసే ట్యాంకుల నిర్మాణానికి, సురక్షిత మంచినీటికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రహదారుల అభివృద్ధిలో సీసీ, బీటీ రహదారుల నిర్మాణం, మరమ్మతులకు నిధులను కేటాయించారన్నారు. గ్రామాలలో కాలువల నిర్మాణం, విద్యుత్ సరఫరా, విద్యుత్ స్తంభాలు ఆధునీకరణ పనుల నిమిత్తం గ్రామ స్థాయిలో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం నిరంతర ప్రక్రియగా చేపట్టామని తెలిపారు. అందుకు సంబంధించి వివరాలు జిల్లాలో జీఎస్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిధుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు అందజేసి, నిధులను కేటాయిస్తున్నామని పేర్కొన్నారు.

ఏనుగుల విధ్వంసం



ఏనుగులు పీకేసిన పామాయిల్ మొక్కలు

గరుగుబిల్లి: కొమరాడ, జియ్యమ్మవలస మండలాల నుంచి వచ్చిన ఏనుగులు వారం రోజులుగా గొట్టివలస, గొల్లవానివలస, మరుపెంట, సాంబన్నవలస పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో సంచరిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి మరుపెంట గ్రామంలో హల్‌చల్ చేస్తూ ఎంపీపీ ఉరిటి రామారావుకు చెందిన ఎకరా పామాయిల్ తోటలో ఇటీవల నాటిన చిన్న మొక్కలను పీకేసి, తొక్కి, నాశనం చేశాయి. మోటారు సెట్‌ను పీకేశాయి. గ్రామంలోని పలువురు రైతులకు సంబంధించిన వరి నారుమళ్లను తొక్కేసి నాశనం చేశాయి. ఇటు పంటలను, అటు విలువైన యంత్ర పరికరాలను నాశనం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులు గ్రామ సమీపంలోనే సంచరిస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. పార్వతీపురం – గరుగుబిల్లి ఆర్అండ్‌బీ రహదారి పరిధిలో ఏనుగులు సంచరిస్తుండడంతో వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ ప్రాంతం నుండి ఏనుగులను తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పంప్‌సెట్‌ను పీకేసిన ఏనుగులు

క్లుప్తంగా

ఘాట్‌రోడ్డులో లారీ బోల్తా



లోయలో పడిన లారీ

పాచిపెంట: మండలంలోని ఆంధ్రా ఒడిశా జాతీయరహదారి పి.కోనవలస ఘాట్ రోడ్డు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ లారీ బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీని, సుంకి నుంచి సాలూరు వస్తున్న లారీ ఘాట్‌రోడ్డు వద్ద ఢీకొంది. దీంతో బొగ్గు లారీ పక్కనే ఉన్న లోయలో బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో డ్రైవరు, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై కేసు నమోదుచేశామని ఎస్‌ఐ ఫకృద్దీన్ తెలిపారు.

కొండచిలువ హతం



గంగన్నపాడులో హతం చేసిన కొండచిలువ

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామ సమీపంలో సంచరిస్తున్న 12 అడుగుల పొడవైన కొండచిలువను ఆదివారం ఉదయం గ్రామస్తులు హతం చేశారు. గ్రామానికి దగ్గరలో గల తోటపల్లి ప్రధాన కుడికాలువకు సమీపంలోని పంట పొలాల్లో కొంతమంది కొండచిలువను చూసి భయపడ్డారు. రోడ్డు పక్కన పొలాల్లో ఉన్న కొండచిలువను చూసిన వారు గ్రామానికి చెందిన మరికొంత మందికి తెలియజేయడంతో అంతా వచ్చి కొట్టి చంపేశారు.

132 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు



నిందితులు, మద్యం బాటిల్స్‌తో ఏఎస్సై భాస్కర రావు

బొబ్బిలి: మండలంలోని శివడవలసకు చెందిన శంబంగి చిన్నారావు, ఒబ్బిశెట్టి చంద్రరావులు బైక్‌పై రూ.20,720ల విలువైన 132 మద్యం సీసాలను తరలిస్తుండగా ఏఎస్సై గౌడు భాస్కరరావుకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. నిందితులిద్దరి నుంచి మద్యం బాటిల్స్, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై విలేకరులకు తెలిపారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలు



గాయాల పాలైన బాధితులు

బలిజిపేట: వెంగాపురం–పదమాయవలస రహదారిలో ఆటో బోల్తాపడడంతో ముగ్గురు గాయాల పాలయ్యారు. వీరఘట్టం మండలం కత్తులకవిటి గ్రామానికి చెందిన వీరు బలిజిపేట మండలం తుమరాడ గ్రామంలో ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి వెళ్తుండగా వెంగాపురం సమీపంలో బైక్ ఎదురుగా రాగా ఆటో బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నాగమణి, సత్యవతి, రాంబాబులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పార్వతీపురం హాస్పిటల్‌కు 108వాహనంలో తరలించారు.

ఓపీఎస్ అమలు చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు కోరా రు. ఈ మేరకు స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఆదివారం పీఆర్‌టీయూ జిల్లా సమావేశం జరి గింది. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వి. రవీంద్ర నాయుడు, ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఆర్.రాంబాబు, బి.శివప్రసాద్, డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,510–00
బంగారం(22సి. 10గ్రా.)	54,550–00
వెండి (కిలో)	76,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

సచివాలయాలే గ్రామ దేవాలయాలు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- చందులూరులో సచివాలయ సముదాయం ప్రారంభం



సచివాలయం సముదాయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: సచివాలయాలే ఆయా గ్రామాల దేవాలయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని చందులూరు గ్రామంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సచివాలయాల సముదాయాన్ని, నూతనంగా నిర్మించిన మహానేత స్వర్గీయ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఏదైనా పని కావాలంటే నాయకుల చుట్టూ ప్రజలు ప్రదక్షిణ చేసేవారని ప్రస్తుతం ఏపని కావాలన్నా సచివాలయంలో సంప్రదిస్తే అయిపోయినట్లేనన్నారు. గ్రామాల్లో సామాజిక అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పిలుపుతో ఎంతో మంది యువకులు ప్రజా సేవలోకి వచ్చారన్నారు. రాష్ట్రాన్ని ఎంతో మంది ముఖ్యమంత్రులు పాలించినప్పటికీ దివంగత



దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్

మహానేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి పాలన స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చన్నారు. సంక్షేమం, అభివృద్ధి సృష్టికర్త ఆయనే నన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా పోలవరం ఎడమ కాలువ నిర్మాణం రూ.6వేల కోట్లతో చేపట్టనున్నామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.

టీడీపీ అధినేతకే గ్యారంటీ లేదు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్‌లకే వారి భవిష్యత్‌పై గ్యారంటీ లేకపోవడంతో రోడ్ల వెంబడి తిరుగుతున్నారని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు వీరు గ్యారంటీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఫార్సులు లేకుండా సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు.గతంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను హింసించారన్నారు.తండ్రికి మించిన పాలన అందిస్తూ ప్రజా మన్ననలు పొందిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పదికాలాల పాటు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు, పంచాయతీ రాజ్ డీఈ స్వామినాయుడు, ఏఈ వీరలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరాము నాయుడు, ఎల్.కోట, వేపాడ ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మూకల కస్తూరి, చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్, వైస్ సర్పంచ్ ఎం.రామారావు,వైస్ ఎంపీపీలు ఆవాల శ్యామల, ఎం.శ్రీనురాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు



మంత్రి బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే

విజయనగరం: రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినోత్సవం సందర్భంగా డిప్యూటీ స్పీకర్ పీడిక రాజన్నదొర, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావులు ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్లు ఆరోగ్యవంతంగా జీవించాలని ఆకాంక్షించారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో అండర్–17, 19 విభాగాల్లో బాల బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాలతో పాటు సీనియర్స్ విభాగంలో స్త్రీ, పురుషులకు పోటీలు జరగ్గా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరై పోటీపడ్డారు. అండర్–17 విభాగంలో 8 మంది క్రీడాకారులు విజేతలుగా నిలవగా వారు ఈనెల 22 నుంచి నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. అలాగే అండర్–19 విభాగంలో సత్తా చాటిన 8 మంది త్వరలో చిత్తూరు జిల్లాలో జరిగే అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొనున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్, సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, అసోసియేషన్ ప్రతినిధులు ఎంకేబీ శ్రీను, నున్న సురేష్, పొట్నూరు శ్రీరాములు తదితరులు బహుమతులు అందజేసి అభినందించారు.

సమాజ హితం కోరే ప్రతి పని అభినందనీయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ఆషాడం సారె కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



నృత్యాలు చేస్తున్న హిజ్రాలు, భక్తులు

విజయనగరం టౌన్: సమాజ హితం కోరే ప్రతి మంచి పని అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రశంసించారు. శ్రీ విజయసాగర దుర్గమ్మ తల్లికి ఆషాడం సారె సమర్పణ కార్యక్రమాన్ని కోట వద్ద ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన డిప్యూటీస్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోరే వారికి తమవంతు చేయూత ఎప్పుడూ ఉంటుందన్నారు. కొన్నేళ్లుగా అమ్మవారికి హిజ్రా అసోసియేషన్ అధ్యక్షుడు దవడ కొండబాబు ఆధ్వర్యంలో సారె సమర్పించడం ఎంతో పుణ్యకార్యక్రమమన్నారు. అనంతరం ఏడు బళ్లలో ఆషాడం సారెను సమర్పించారు. జిల్లాలో కొత్తగా పెళ్లైన ప్రతి ఆడబిడ్డ సుఖసంతోషాలతో పసుపు, కుంకుమలతో పదికాలాల పాటు చల్లగా ఉండాలని కోరుతూ అమ్మవారికి ప్రతి ఏడాది సారె సమర్పిస్తున్నామని హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ అధ్యక్షుడు కొండబాబు, కోశాధికారి దవడ మీనా, స్రవంతిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఘటాలు సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో సచివాలయం-4 ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: పట్టణంలోని సచివాలయం–4 నూతన భవనాన్ని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం చీపురుపల్లి వచ్చిన ఆయన రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం–4 భవనంతో బాటు రూ.17.50 లక్షల నిధులతో నిర్మించిన వెల్‌నస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం గ్రామ సచివాలయ భవనంలో ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఆయన జన్మదినోత్సవం సందర్భంగా నూతన భవనంలో కేక్ కట్ చేశారు. నూతన సచివాలయ భవనంతో బాటు వెల్‌నెస్ కేంద్రంలో ఏర్పాట్లు, ఉద్యోగులు గదులు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఆర్‌డీఓ ఎం.అప్పారావు, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, మండల ఇంజినీరింగ్ అధికారి డి.రమేష్, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, అప్పికొండ ఆదిబాబు, మంగళగిరి శ్రీను, కరణం ఆది తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా వంతెన పిల్లర్ల ఏర్పాటు

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామం వద్ద నాగావళి నదిపై బలసలరేవు నుంచి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ఇసుకలపేట వరకూ చేపట్టిన వంతెన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.87 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ పనుల్లో 560 మీటర్ల పొడవునా వంతెన నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం వాల్తేరు వైపు తొలిపిల్లర్ నిర్మాణం ప్రారంభించారు. ఈ నిర్మాణాలను కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడుతో పాటు ఆర్‌అండ్‌బీ ఏఈ అంజనేయులు నాయక్ ఆదివారం పరిశీలించారు.



వంతెన తొలి పిల్లర్ల నిర్మాణం

విద్యుత్‌షాక్‌తో బాలుడికి గాయాలు



విద్యుదాఘాతానికి గురైన మనోజ్

పాచిపెంట: మండలంలోని కోడికాళ్లవలస గ్రామానికి చెందిన బాలుడు మనోజ్ విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలయ్యాడు. గ్రామానికిచెందిన మనోజ్, మరో నలుగురు స్నేహితులు కలిసి శనివారం సైకిళ్లపై మడవలస వద్ద వాటర్‌ఫాల్స్‌కు పయనమయ్యారు. ఈ క్రమంలో సమీప డొంకల్లో బహిర్భూమికి వెళ్లిన మనోజ్ అటుగావెళ్తున్న విద్యుత్ వైర్లను గమనించకపోవడంతో అవి తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం, విజయనగరం కేంద్రాస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల సిఫారసు మేరకు ఆదివారం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

కాళ్ల పారాణి ఆరక ముందే..!

ఐదు నెలల క్రితం జరిగిన వివాహానంతరం కోటి ఆశలతో కొత్తజీవితంలోకి అడుగుపెట్టిన ఓ నవజంట భవిష్యత్తు గురించి ఎన్నో కలల కంటూ సంతోషంగా గడుపుతున్నారు. ఇంతలోనే విధికి కన్నుకుట్టడంతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన ప్రమాదంలో నవ వరుడి ప్రాణాలు గాలిలో కలిసిపోగా నవవధువు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషాద వార్తతో రాజాం మండల పరిధిలోని బొద్దాం గ్రామస్తులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.



గ్రామస్తుల నుంచి వివరాలు ఆరా తీస్తున్న తహసీల్దార్ ఎస్‌కేరాజు, ఆర్‌ఐ విద్యాసాగర్

- ఉత్తరాఖండ్ ప్రమాదంలో చిక్కుకున్న నవజంట
- నవవరుడి మృతి..గాయాలతో బయటపడిన వధువు



భార్య కల్యాణితో రవిరావు (ఫైల్)

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన జరజాన రవిరావుకు, పట్టణ పరిధిలోని సారథికి చెందిన కల్యాణితో ఫిబ్రవరి 12న వివాహమైంది. రవిరావు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ భార్య కల్యాణితో జీవనం సాగిస్తున్నాడు. ఈ నవజంట వారం రోజుల క్రితం కేథారినాథ్ యాత్రకు హైదరాబాద్ నుంచి బయల్దేరింది. యాత్ర జాలీగా సాగుతున్న సమయంలో శనివారం రాత్రి (తెల్లవారితే ఆదివారం) అక్కడ భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడడంతో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఉధృతంగా ప్రవహిస్తున్న గంగానదిలో ప్రయాణికులంతా గల్లంతయ్యారని తొలుత భావించారు. వెంటనే అప్రమత్తమైన రెస్క్యూటీం బాధితులను రక్షించే క్రమంలో కల్యాణితోపాటు మరికొంతమందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. ముమ్మరగాలింపు చర్యలు చేపట్టిన తరువాత రవిరావు (29) మృతిచెందినట్లు గ్రామస్తులకు సమాచారం అందడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఇదిలా ఉండగా మృతుని కుటుంబ సభ్యులంతా తగరపువలసలో జరుగుతున్న బాల సారె కార్యక్రమంలో ఉన్నారు. రవిరావు మృతి విషయం తెలుసుకున్న వీరంతా విషాదంలో మునిగిపోయారు.

అధికారుల ఆరా..

గ్రామానికి చెందిన రవిరావు దంపతులు తీర్థయాత్రకు వెళ్లి ప్రమాదం బారిన పడిన విషయంపై తహసీల్దార్ ఎస్‌కే రాజు, ఆర్‌ఐ విద్యాసాగర్‌లు గ్రామానికి వచ్చి ఆరా తీశారు. రవిరావు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లను కోరినట్లు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మతో పాటు గ్రామస్తులు తెలిపారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన జిల్లా నేతలు



టీటీడీ బోర్డు ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో జిల్లా ప్రజాప్రతినిధులు

విజయనగరం: టీటీడీ బోర్డ్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఆదివారం కలిశారు. ఈ మేరకు విశాఖలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనను ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో పాటు ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియామకమైన డాక్టర్ డీవీజీ శంకరరావులు కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల డీవీజీ శంకరరావు హర్షం వ్యక్తం చేస్తూ వైవీ సుబ్బారెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు.

మంచినీటి కోనేర్లకు మహర్దశ



దబ్బిరాజుపేటలో పనులు చేపట్టకముందు తుప్పలతో నేపాలం మొక్కలతో నిండిపోయిన కోనేరు



పనులు చేపట్టిన తర్వాత నీటితో ఉన్న కోనేరు

- ఉపాధి నిధులతో పునరుద్ధరణ
- జిల్లాలో 46 గుర్తింపు

విజయనగరం ఫోర్ట్: పై ఫొటోలో నేపాలం మొక్కలతో కప్పేసి ఆనవాళ్లు కూడా లేకుండా ఉన్న కోనేరు వేపాడ మండలం దబ్బిరాజుపేట గ్రామంలోనిది. అధ్వాన స్థితిలో ఉన్న ఈ కోనేరును ఉపాధి నిధులతో గతంలో ఉండే కోనేరు విధంగా తయారు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇప్పుడు ఈకోనేటి నీటితో పశువులు, గొర్రెలు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

కింద ఫొటోలో మురికి కూపంలా కనిపిస్తున్న కోనేరు గంట్యాడ మండలం నరవ గ్రామంలోనిది. దుర్వాసన వచ్చే విధంగా తయారైన చెరువును ఉపాధి నిధులతో గతంలో ఉన్న మంచినీటి కోనేరులా సిద్ధం చేశారు. కోనేరు నీటితో ఇప్పుడు పశువులు, గొర్రెలు దాహార్తి తీర్చుకుంటున్నాయి.

ఈ రెండు మంచినీటి కోనేరులే కాదు. జిల్లా వ్యాప్తంగా పిచ్చి మొక్కలు, తుప్పలు, పనికిరాని వ్యర్థాలతో నిండిపోయిన మంచినీటి కోనేరులను యథాస్థితికి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలోని 46 మంచి నీటి కోనేరులను పునరుద్ధరించడానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు గుర్తించారు. తొలివిడతలో 23 కోనేరుల్లో పనులు చేపట్టారు. ఈ మేరకు గంట్యాడ, భోగాపురం, నెల్లిమర్ల, వేపాడ, రాజాం, రామభద్రపురం మండలాల్లో పనులు జరుగుతున్నాయి.

లక్ష్యం ఇది

ఎందుకు పనికిరాని విధంగా ఉన్న మంచినీటి కోనేరులను పునరుద్ధరణ ద్వారా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం, భూగర్భ జలాలు మరింత అభివృద్ధి చేయడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, పశువుల దాహార్తిని తీర్చడం, మంచినీటి కోనేరుల పునరుద్ధరణ లక్ష్యం.

ఉపాధిలో కోనేరుల అభివృద్ధి




మంచినీటి కోనేరుల పునరుద్ధరణ పనులు ఉపాధి పథకంలో జిల్లాలో చేపడుతున్నాం. వృథాగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో మంచినీటి కోనేరుల పునరుద్ధరణ పనులు చేస్తున్నాం. కోనేరులను వినియోగంలోకి తీసుకురావడం వల్ల పశువుల దాహార్తి కూడా తీరుతుంది.

– జి. ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ



నరవ గ్రామంలో బురదమయంతో ఉన్న మంచినీటి కోనేరు



పనులు చేపట్టిన తర్వాత కోనేరులో నీరు తాగుతున్న గొర్రెలు